'సంఘమిత్ర'కు స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి -నల్లజర్ల

హైదరాబాద్‌లోని హైటెక్స్, బ్రెయిన్ ఫీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డ్ ఫంక్షన్‌లో శ్రీ సంఘమిత్ర విద్యాలయ అవార్డు అందుకుంది. 26 ఏళ్లుగా అందిస్తున్న విద్యా సేవలను గుర్తించి స్టేట్ లెవెల్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు 2023-24కు ఎపి అప్పస్మా స్టేట్ జనరల్ సెక్రటరీ తులసి ప్రసాద్ ద్వారా స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డ్ తమ 26 ఏళ్ల కృషికి నిదర్శనమని అన్నారు. ఈ అవార్డ్ రావడం చాలా ఆనందదాయకమన్నారు. రానున్న రోజుల్లో విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్తామని తెలిపారు.

'తూర్పు'న సాబ్జీ అడుగుజాడ

- అనేక ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం
- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం
- శాసన మండలిలో ప్రజాగళం వినిపించిన సాబ్జీ
- ఆయన మృతితో జిల్లాలో విషాదం

ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో ప్రతి కార్యకర్తనూ పేరుపేరునా పిలుస్తూ అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ఆయనది. సమస్యల సాధనలో దూకుడైన శైలి ఆయన సొంతం. పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ప్రభుత్వం ఇచ్చే అనేక సౌకర్యాలను ఆయన త్యజించి సాధారణ పౌరునిగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేసిన నాయకుడు షేక్ సాబ్జీ. ఆయనకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాతో విడదీయరాని బంధం ఉంది. ఆయన మృతి జిల్లా వాసులను కలిచివేసింది. భౌతికంగా ఆయన దూరమైనా ఆయన వేసే ఉద్యమ అడుగుజాడలు జిల్లాలో చెరగని ముద్రలుగా నిలిచాయి.

ఎన్నికల ప్రచారంలో సాబ్జీ(ఫైల్)

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ప్రజా ఉద్యమాల్లో ఎంఎల్‌సి సాబ్జీ తనదైన పాత్ర పోషించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపైనా కాకుండా కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపైనా, పేదలు, రైతులు, కౌలు రైతుల సమస్యలపైనా శాసనమండలిలో తన గళాన్ని వినిపించారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జరిగిన పోరాటాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. రాజమహేంద్రవరంలో కందుకూరి వారి ఆస్తులు ప్రభుత్వ పరం చేయాలని, అప్పటి శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, కెఎస్.లక్ష్మణరావులను కలుపుకొని ప్రజల భాగస్వామ్యంతో పోరాటాలు చేశారు. ఆ పోరాట ఫలితంగానే నేడు కందుకూరి విద్యా సంస్థలు ప్రభుత్వంలో విలీనం అయ్యాయి. అలాగే అధ్యాపకుల వేతనాల జిఒ విడుదల కోసం ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యా శాఖ మంత్రిని కలిసి విజయం సాధించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కోవిడ్ సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ఉపాధ్యాయులకు వ్యాక్సినేషన్ సెంటర్ల వద్ద డ్యూటీలు వేయడాన్ని వ్యతిరేకించారు. వారిని వెనక్కి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. సిపిఎస్ రద్దు కోసం ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన యాత్రలో బైక్‌పై మండపేటలో ప్రయాణం చేసి స్ఫూర్తిగా నిలిచారు.

ఈ ఏడాది ఆగస్టులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రలోనూ ఆయన భాగస్వాములయ్యారు. స్వయంగా సైకిల్ తొక్కి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థి సంఘం వెలుగులోకి తెచ్చిన అనేక సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించారు. కార్మికుల సమస్యలపై జరిగిన పోరాటాల్లోనూ భాగస్వాములయ్యారు. ఆయనకు ఎంతో ఇష్టమైన పిల్లల పండుగ బాలోత్సవం రాజమహేంద్రవరంలో నిర్వహించడానికి సాయశక్తుల కృషి చేశారు. గోదావరి బాలోత్సవం గౌరవాధ్యక్షులుగా వ్యవహరించారు. దీని విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ముగింపు సభలో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ చిన్నారులను ఉత్సాహపరిచారు. తాజాగా 2024 బాలోత్సవానికి కూడా ఆయన గౌరవాధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ నెల 19న జరిగే బ్రోచర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొనేందుకు హాజరు కావల్సి ఉంది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. ఆయన మృతి జిల్లా ఉద్యమాలకు తీరని లోటు అని జిల్లాలోని విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు.

2021 మార్చి 17న జరిగిన ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో సాబ్జీ విజయం సాధించారు. అనంతరం ఆయన కాకినాడ జెఎన్‌టియుకె కౌంటింగ్ కేంద్రం వద్ద విజయకేతనం చూపిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. కాకినాడ నగరమంతా జరిగిన మోటారు సైకిల్ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు.

బస్సయాత్రలో భాగంగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలతో షేక్ సాబ్జీ (ఫైల్)

2022 జనవరి 29న పిఆర్‌సి సాధన సమితి ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల రాష్ట్ర స్థాయి రిలే దీక్షలు జరిగాయి. దీనికి ఆయన మద్దతుగా పాల్గొన్నారు. 11వ పిఆర్‌సిపై ప్రభుత్వం చేసిన జాప్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.

2022 జూలై 25 నుంచి 31 వరకు పలాస నుంచి పెనుగొండ వరకూ జరిగిన 'బడి కోసం బస్సు యాత్ర' కాకినాడ వచ్చింది. ఈ యాత్రలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అందరూ పాల్గొన్నారు. ఇందులో సాబ్జీ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన ఉత్తేజ పూరితమైన ప్రసంగాలు చేశారు.

2022 నవంబర్ 29న కాకినాడ టీచర్స్ హోమ్‌లో జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా 5వ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. అలుపెరగని పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు.

2023 నవంబర్ 12న కాకినాడ జెఎన్‌టియుకెలో జరిగిన జెవివి 17వ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రజల కోసం, సైన్స్ ప్రగతి కోసం సైన్స్, పర్యావరణం కోసం సైన్స్ నినాదాలతో పనిచేస్తున్న జెవివి ప్రజా సైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మరింత కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

సాబ్జీ మృతికి పలువురి సంతాపం

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : సిపిఎం

పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ బాబ్జి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. జిల్లాలో నిర్వహించిన విద్యార్థి, ఉపాధ్యాయ, అనేక ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు, శాసన మండలిలో సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి సాబ్జీ కృషి చేశారన్నారు. అందర్నీ కలుపుకొని కలిసిపోయే స్వభావం కలిగిన ఆయన మరణం తీరని లోటు అని, ఆయన మృతికి సంతాపం తెలిపారు. సిపిఎం నగర కార్యాలయంలో నగర కార్యదర్శి బి.పవన్, పోలిన వెంకటేశ్వరావు, మురళి, రాంబాబు, అన్నామణి, వెంకటలక్ష్మి, సుధ సంతాపం తెలిపారు. ఆయన సేవలను స్మరించుకున్నారు.

సాబ్జీ మృతి విద్యార్థి ఉద్యమాలకు తీరని లోటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కరరావు, ఎన్.రాజా ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

గోదావరి బాలోత్సవం విజయవంతానికి సాబ్జీ విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, ప్రధాన కార్యదర్శి మెండు కోదండరామ్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీష్ మాథ్యూస్, ఈశ్వర్ రావ్, శ్రీనివాస్, సత్యదేవ, సుబ్బారావు, భరణి, సుధాకర్, విశ్వనాధ్, గనెయ్య, శిరీష, శ్రీదేవి, విజయదుర్గ సంతాపం తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయకర్, షరీఫ్ కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.

తాళ్లపూడి యుటిఎఫ్ శాఖ అధ్యక్షుడు క్రాంతి కుమార్, జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు విజయబాబు, రాజకుమారి, శ్రీనివాస్, కృష్ణవేణి, అనిత, పూర్ణిమ, రాము పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు దున్నా దుర్గారావు సాబ్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఉండ్రాజవరంలో అంగన్‌వాడీలు నివాళులర్పించారు. చాగల్లు సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.ఆదం, రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు, కె.బుద్ధుడు సంతాపం తెలిపారు. గోపాలపురం ఎంఇఒ జి.శ్రీనివాసరావు చెక్ పోస్ట్ సెంటర్ వద్ద సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెలుగు స్కూల్ ప్రిన్సిపాల్ ఉమాదేవి, బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సాయినాథ్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సాబ్జీకి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

విజన్ అకాడమీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రముఖ విద్యాసంస్థ విజన్ అకాడమీ 2024 క్యాలండర్‌ను శుక్రవారం నూతన బ్రాంచ్ దానవాయిపేటలో స్టాఫ్, విద్యార్థుల సమక్షంలో డైరెక్టర్ యాగా గోవింద రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భం గోవిందరాజు మాట్లాడుతూ, క్యాలండర్‌లో ఐఐటి, జెఇఇ, నీట్, ఎంసెట్‌కు సంబంధించిన వివరాలు, విజన్ అకాడమీ సాధించిన విజయాలు, లాంగ్‌టెర్మ్ కోచింగ్ ప్రత్యేకత, జూనియర్ కాలేజీ అడ్మిషన్స్, జూనియర్ కాలేజీ ప్రత్యేకతలు పొందుపరిచినట్టు తెలిపారు. ఏడేళ్లుగా రాజమహేంద్రవరంలో విద్యారంగంలో ఉత్తమ సేవలు అందిస్తూ నీట్, ఐఐటి, జెఇఇ, ఎంసెట్ కోచింగ్‌లో నూతన ఒరవడి సృష్టిస్తూ ఉత్తమ ర్యాంకులు సాధించిన సంస్థగా పేరు సాధించిన విజన్ అకాడమీ ఈ సంవత్సరం నుంచి జూనియర్ కాలేజీ అడ్మిషన్స్, కోర్స్ జాయిన్ అయిన ప్రతి విద్యార్థికీ ఉత్తమ విద్యను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమన్నారు. ఉత్తమ డాక్టర్స్, ఇంజనీర్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్టు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోవిందరాజు

'ఆడుదాం ఆంధ్ర' వాయిదా

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపిడిఒ జివిఎస్‌కె.రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటల వివరాల సేకరణకు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టేట్ లెవెల్ టోర్నమెంట్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, ఆదివారం వరకు పొడిగించినట్టు తెలిపారు. 26వ తేదీ నుంచి ఆటల పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగి, వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

తాళాలు బద్దలు కొడుతున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రం స్వాధీనం

ప్రజాశక్తి-పెరవలి

సమ్మెలో ఉన్న అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పని చేసే సెంటర్‌లను జిల్లాస్థాయి అధికారులు ఆదేశాల మేరకు తాళాలు సుత్తులతో బద్దలు కొట్టి స్వాధీనం చేసుకున్నారు. పెరవలి ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో 211 సెంటర్లు ఉండగా 209 మంది కార్యకర్తలు 209 మంది ఆయాలు పని చేస్తున్నారు పెరవలి-65 నిడదవోలు-83 ఉండ్రాజరం-63 విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తాళాలు బద్దలు కొట్టి స్టాకు వివరాలు సేకరించారు. ఆయా కేంద్రాల్లో గ్రామ మహిళా పోలీస్ డ్వాక్రా మహిళలు గ్రామ వాలంటీర్లు లతో పిల్లలకు ఫుడ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిసింది.

ఇంధన వనరుల పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన కళాశాల భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యాన శుక్రవారం ఇంధన పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రాఘవకుమారి మాట్లాడుతూ మనకు అవసరం లేనపుడు తప్పనిసరిగా లైట్లు, ఫ్యాన్లు ఆపివేయాలని, పగటిపూట వీలైనంతవరకు కిటికీలు తెరిచి ఉంచడం వల్ల లైట్లు, ఫ్యాన్ల వాడకం తగ్గించవచ్చునని చెప్పారు. కాంతి కోసం గోడలకు తెలుపు వంటి లేత రంగులను వేస్తే ఇల్లు కాంతివంతంగా ఉంటుందన్నారు. ఫైవ్ స్టార్ రేటెడ్ గృహోపకరణాలు, ఎల్ఇడి బల్బుల వాడకం వల్ల కరెంట్ బిల్లు చాలా తగ్గడమే కాక కాలుష్యం కూడా బాగా తగ్గించినవారమం అవుతామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు టి.గాబ్రియేలు, ఎస్.దేవయ్య, టి.శిరీష, పి.మాధురి బి.శ్రీహరి మాట్లాడుతూ ఇంధన పరిరక్షణ చట్టాలను వివరించారు. లైట్ల వాడకం, ఇస్త్రీ పెట్టెలు, ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ కుక్కర్, ఎసి, గీజర్, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ వాడకంలో పొదుపు చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెఎస్.రత్నకుమార్, అధ్యాపకులు జి.పద్మ, వైవిఎస్ ఎస్ఎన్ఎల్ నారాయణ పాల్గొన్నారు.

4వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. జిల్లావ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టారు. వీరికి టిడిపి, జనసేన పార్టీ, పలు ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం అంగన్వాడీ ఉద్యోగులకు మద్దతుగా ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అంగన్వాడీల శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్, అధ్యక్షుడు జి.రాంబాబు, సంయుక్త కార్యదర్శి మాథ్యూస్, జోనల్ అధ్యక్షుడు పి.సతీష్ పాల్గొన్నారు. **చాగల్లు** తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలో సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు, సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.ఆదం మాట్లాడారు. అంగన్వాడీలు గ్రామంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. జనసేన నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, ఉప్పులూరు బాబ్జి, శెట్టి సుభాషిణి, కొప్పాక విజయ్ కుమార్, శీతల్, ఉప్పులూరు చిరంజీవి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.విజయ్ కుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, బి.మహాలక్ష్మి, ఎ.శ్రీదేవి, ఎస్.అరుణ్ కుమార్ పాల్గొన్నారు. **తాళ్లపూడి** టిడిపి, జనసేన నాయకులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నామన పరమేశ్వర రావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గాయత్రి వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** అంగన్వాడీలు నలుపు రంగు చీరలు ధరించి, సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. ఎస్.రంగనాయకమ్మ, కె.లక్ష్మీకుమారి, ఎం.జానకి, కెఎన్ఎస్.ప్రసన్నకుమారి, సిహెచ్.జ్యోతి, ఎంవి.నరసమ్మ, జి.సువర్ణలత, ఉషారాణి, పి.గిరిజ, నిర్మల, కె విజయ కుమారి, కె.వరలక్ష్మి పాల్గొన్నారు. **నల్లజర్ల** సిఐటియు నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు, ఎస్‌కె.భగత్, పశ్చిమ గోదావరి మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు కె.విమలబాయ్, ఎస్.శివకుమారి, ఝాన్సీలక్ష్మి, ఐ.రామలక్ష్మి, నాగమణి, రాజేశ్వరి, పి.జగదీశ్వరి, బేబీ, దుర్గంబికా, ధనలక్ష్మి, ఎం.మల్లమ్మ, యం.మాలతి, వెంకటరత్నం పాల్గొన్నారు. **కడియం** తహశీల్దార్ కార్యాలయం అంగన్వాడీలు నలుపు చీరలు ధరించి నిరసన తెలిపారు. తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపిపి పంతం గణపతి, వెలుగుబంటి నాని, ముద్రగడ జెమ్మి, బోడపాటి రాజేశ్వరి, రత్నం, అయ్యప్ప అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. **గోపాలపురం** అంగన్వాడీల దీక్షకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు సంఘీభావం తెలిపారు. రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** తహశీల్దారు కార్యాలయం వద్ద సుమారు వందమంది అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

గోపాలపురంలో అంగన్‌వాడీల సమ్మె

చాగల్లులో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

కడియంలో..

కార్టూ'నిజం'

ఆశా వర్కర్ల మహా ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్స్ చేపట్టిన ధర్నా శుక్రవారం రెండో రోజుకు చేరింది. గోకవరం బస్టాండ్ వద్ద సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా, వంటా వార్పు అనంతరం సబ్ కలెక్టరేట్ నుంచి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం, ఆనం కళాకేంద్రం మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో హామీలు కురిపించారని, గద్దెనెక్కాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. కోవిడ్‌లో ఇల్లు, కుటుంబాలు వదిలి, ప్రాణాలు సైతం లెక్కచేయక ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. కోవిడ్‌లో ఆశాలను పొగడ్తలతో ముంచేశారు తప్ప నయా పైసా వేతనం పెంచలేదన్నారు. సుప్రీంకోర్టు వేతన కార్మికులందరికీ గ్రాడ్యుటీ ఇవ్వాలని ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా కనీస వేతనం ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ఆన్‌లైన్ వర్క్‌లు తగ్గించాలని, సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు టిడిపి సిటీ ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి వాసు, నాయకులు రెడ్డి మణి, చండి ప్రియ మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో ఎపి ఎంఎస్ఆర్‌యు రాష్ట్ర నాయకులు కృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్.మూర్తి, కెఎస్‌వి.రామచంద్రరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.అన్నామణి, ట్రెజరర్ ఎం.వెంకటలక్ష్మి, సిపిఎం నగర్ కార్యదర్శి బి.పవన్ ధనలక్ష్మి, కొండ వెంకటలక్ష్మి, ఐ.వెంకటలక్ష్మి, రాజకుమారి, నాగమణి, హవేల, మేరీ, లక్ష్మి, సత్యవతి, లీల, దుర్గ, కోరుకొండ వెంకట లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం, టిడిపి నాయకులు

రాజమహేంద్రవరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

6న పడాల శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వాతంత్ర్య సమర యోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శతజయంతి ఉత్సవాలు జనవరి 6న నిర్వహించనున్నట్టు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని కందుకూరి వీరేశలింగం ఆస్తిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 3 సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రారంభ సమావేశంలో సాహిత్య అకాడమీ ఆఫీసర్ డాక్టర్ ఎన్.రాజమోహన్, అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు మందలపర్తి కిషోర్, ముఖ్యఅతిథిగా ఎపి పాఠశాల విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ ఆశపు రామలింగేశ్వరరావు, అరసం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి కీలక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. డాక్టర్ పెనుమాకుల భాస్కరరావు రచించిన పడాల రామారావు జీవితం-సాహిత్యం గ్రంథాన్ని ఆవిష్కరిస్తామన్నారు. ఈ 3 సదస్సుల్లో ఎపి అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఉన్నత విద్య ఆర్‌జెడి ఆచార్య చప్పిడి కృష్ణ, ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు, విశ్రాంత ఎపి పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం.వెంకటేశ్వర్లు, రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌విఎస్.రాజు, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, డాక్టర్ పివిబి. సంజీవరావు, వాడ్రేవు సుందరరావు తదితరులు పాల్గొం టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చిన్నలంక కాలువలో రెండు మృతదేహాల స్వాధీనం

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు చినలంక కాలువలో రెండు గుర్తు తెలియని మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పలివెల నుండి ముక్కామల ప్రధాన పంట కాలువలో రెండు గుర్తుతెలియని మృతదేహాలను స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంబాజీపేట పోలీసులు జేవిఎస్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 35 ఏళ్ల మహిళ, 13 ఏళ్ల బాలికగా గుర్తించి మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధం అయినట్లు ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం సహాయ అగ్నిమాపక అధికారి కె.మురళి కొండబాబు తెలిపారు. భాదితులు మరియు అగ్నిమాపక అధికారి తెలిపిన వివరాల ప్రకారం..ముమ్మిడివరం నగర పంచాయతీ 4వ వార్డు సంత మార్కెట్ ఏరియాలోని మంద బయలు ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం మోర్త ఆదిలక్ష్మి భర్త ఆనందరావుకు చెందిన తాటాకింటి నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్ని మాపక కేంద్రం ఇన్ ఛార్జ్ అధికారి కొండబాబు అద్వర్యం లో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు చుట్టు పక్కలకు వ్యాప్తి చెందకుండా అదుపుచేశారు.ఈ అగ్ని ప్రమాదంలో భాదితులు కట్టు బట్టలతో బయట పడ్డారని తెలిపారు. బాధితురాలు ఆదిలక్ష్మి కుమార్తె పెళ్ళి కోసం దాచిన రూ.1.50 లక్షలు, పెళ్లి దుస్తులు మరియు ఇంటికి సంబంధించిన దస్తావేజులు కాలి బూడిదైనట్లు బోరున విలపిస్తున్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి సిబ్బంది పలుప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 21 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడుతూ అప్పన్నపాలెం గ్రామంలో ఆరు లీటర్ల సారతో ఒక మహిళను, రామచంద్రపురం గ్రామంలో 5 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, సోమవారం గ్రామంలో ఐదు లీటర్ల సార్‌తో ఒక వ్యక్తిని, తామరాడు గ్రామంలో ఐదు లీటర్ల సారాతో మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డిటిఎఫ్ ఎస్ఐ జై విజయ్ కుమార్, సిబ్బంది కృష్ణార్జున, దొరబాబు, రాజు, వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

స్వీట్లు పంచుతున్న దాతలు

'భవిత'లో వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలోని భవిత సెంటర్‌లో వికలాంగుల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.గౌరమ్మ తిమ్మరాజు దొర మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా భవిత సెంటర్ నిర్వహిస్తున్నామని, ఈ పాఠశాలకు అమెరికాలో ఉంటున్న గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన నాగులపాటి కిరణ్ కుమార్ టివి బహూకరించారని తెలిపారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు, తల్లిదండ్రులకు నాగుల కొండ బుజ్జి స్వీట్లు, డ్రై ఫ్రూట్స్, పద్మనాభుని దుర్గాజి భోజనం ఏర్పాటు చేశారని తెలిపారు. వారికి భవిత సెంటర్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, ఉపాధ్యాయులు ఎస్తేర్ రాణి, మణికంత, కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తూరంగిలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

సమ్మెను పరిష్కరించాలని లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అంగన్‌వాడీల న్యాయమైన సమ స్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు ధర్నా చేశారు. రూరల్ మండలం తూరంగి పంచాయతీలో శుక్రవారం అంగన్‌వాడీ కేం ద్రాల ద్వారా లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ పట్టణ సిపిఎం కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లా డుతూ పిల్లలకు, బాలింతలకు పౌష్టి కాహారాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ సెంట ర్లను, సేవలందిస్తున్న కార్యకర్తలు, ఆయాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎటు వంటి బేషిజాలకు పోకుండా సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం లబ్దిదారులు సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, తటవర్తి సుబ్బా రావు, పొట్నూరి జయప్రకాష్, జోగా అప్పారావు యుటిఫ్ విశ్రాంత నాయకులు పుప్పాల గోవిందరాజులు, జనసేన నాయకులు, లబ్దిదారులు కక్కల సునీత, ఆకుల రజనీ, దువ్వి వెంకట దేవి, చింత అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న చందన నాగేశ్వర్

హకుంపేటలో నాగేశ్వర్ పర్యటన

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్

హుకుంపేట పాత పంచాయతీ పక్కన ఉన్న రజకులపేటలో వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం పర్యటించారు. వీధిలో మురుగు కాలువలు పూర్తిగా పాడై మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోందని స్థానికులు నాగేశ్వర్ దృష్టికి తీసుకొచ్చారు. సిసి డ్రైన్లను వెడల్పు చేసి మురుగు నీరు సవ్యంగా పారేలా కొత్త సిసి డ్రైన్లను నిర్మిస్తామని, ప్రతిపాదనలు వేగంగా తయారు చేసి మౌలిక సదుపాయాల పనులన్నీ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాలువల పునరుద్ధరణకు అంచనా నివేదికలు తయారు చేయాల్సిందిగా హుకుంపేట పంచాయతీ ఇఒ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళ్తున్నాయని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో పసలపూడి శ్రీనివాస్, చిర్రా గణేష్, కుప్పాల రాంబాబు, పి.శేషాద్రి, గిరిజాల. శ్రీనివాస్, షేక్ మీరావలీ, షరీఫ్, బొప్పన సుబ్బారావు, హుకుంపేట పంచాయతీ ఇఒ జి.వెంకట్రావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో నివాళి అర్పిస్తున్న ఎంపిపి యల్లారీశ్వరి తదితరులు

అమరజీవి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-తాళ్లపూడి, ఉండ్రాజవరం

ఉద్యమ స్ఫూర్తితో ఎటువంటి సమస్యనైనా అధిగమించవచ్చని నిరూపించిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని తాళ్లపూడి మండలం రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో శ్రీరాములు చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి, నివాళు లర్పించి మాట్లాడారు. ఎంపిడిఒ జివిఎస్ఆర్‌కె.రాజు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు శ్రీరాములు నాంది పలికారన్నారు. ఈ కార్యక్రమంలో పాలాటి శరత్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు

ఉండ్రాజవరంలో గడప గడపకూ..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల కేంద్రం ఉండ్రాజవరంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరిస్తూ, అధికారుల సమక్షంలో ప్రతి ఇంటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను, అవసరాలను తెలుసుకోవడమే కాక వారికి పరిష్కారాన్ని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులం, మతం, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మెండే వెంకటరావు, వైస్ ఎంపిపి సరోజి, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారధులు, వాలంటీర్స్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తున్న ముఖ్య అతిథులు

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హుకుంపేటలోని జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడారు. ప్రభుత్వం వినియోగదారుల హక్కులను పాఠ్యాంశంలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచీ వినియోగదారుల హక్కులను తెలుసుకుంటే సమస్యల పరిష్కారం సులువవుతుందన్నారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-4000, ఎన్‌సిహెచ్ యాప్, సైబర్ క్రైమ్‌లపై 1930లో సంప్రదించాలన్నారు. జిల్లాలోని వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి సమస్యకు పరిష్కారం, నష్టపరిహారం పొందవచ్చన్నారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు అమరావాడి రామకృష్ణ మాట్లాడుతూ వస్తువు కొనేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కన్స్యూమర్ క్లబ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం బివిఎస్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

లాయర్లు, అంగన్‌వాడీలకు కాంగ్రెస్ మద్దతు

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని నిడదవోలు కోర్టు వద్ద నాలుగు రోజులుగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ కమిటీ పట్టణ అధ్యక్షుడు కారింకి వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. అంగన్‌వాడీల దీక్షకు కూడా కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపారు. న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే కర్కశంగా వ్యవహరిస్తోందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు చేయాల్సిన పనిని నిరసన దీక్షలో ఉంటే వేరే సిబ్బందితో చేయించడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, ఉషారాణి, షేక్ కాశిం, సరిపల్లి రమణ, అన్వర్ ఖాన్, జిలాని, కిషోర్, ప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సుబ్రహ్మణ్యేశ్వర షష్టి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద సుబ్రహ్మణ్యేశ్వర షష్టి నేపథ్యంలో ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి రోజున స్వామివారి దర్శనార్థం భారీ ఎత్తున యాత్రికులు వస్తారు కనుక వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రత విషయంలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పోలీస్ శాఖ ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. మిగిలిన శాఖ వారు ఆలయ కమిటీతో తగిన ఏర్పాట్లు, ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి (బుజ్జి), వైస్ ఎంపిపి బుద్దాల కన్నారావు, సర్పంచ్ సరెళ్ల సుమలత, శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస రెడ్డి, కమిటీ సభ్యులు జంగా మురళీ కృష్ణారెడ్డి, ఎంపిటిసి తొండాపు శ్రీలక్ష్మి, గువ్వల సత్తిరెడ్డి, యమసాని రవీంద్ర పాపారెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణ రెడ్డి

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-బిక్కవోలు

వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కొంకుదురు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అధ్యక్షతన హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులు ఎయిడ్స్ పట్ల అవగా హన కలిగి ఉండి, అందరికీ అవగాహన కల్పించి ప్రజలను చైతన్య వంతులుగా చేస్తామని, ఎయిడ్స్ వ్యాధి తీవ్రతను తగ్గించడం ద్వారా 2030 నాటికి ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా, దేశంగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కౌమార విద్యా రిసోర్స్‌పర్సన్ కంభంపాటి అప్పారావు, పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ నూకరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీనివాస్

నేడు జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జనసేన పార్టీ ఉండ్రాజవరం మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు వీరమల్ల బాలాజీ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఉండ్రాజవరం శ్రీ సుధీంద్ర బాబు కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ సమ్మేళనంలో పార్టీ నిడదవోలు నియోజకవర్గ సమన్వయకర్త భోగవల్లి ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ఈ సమ్మేళానికి అధిక సంఖ్యలో నాయకులు, మహిళలు, కార్యకర్తలు హాజరవ్వాలని బాలాజీ కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

ప్రజాశక్తి-గోకవరం

కొత్తపల్లి పిహెచ్‌సిలో శుక్రవారం సెకండ్ ఫేజ్ జగనన్న ఆరోగ్య సురక్షపై ఆరోగ్య సిబ్బందికి ఎంపిహెచ్‌సిఒ మూర్తి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి సెకండ్ ఫేజ్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గృహాలను సందర్శించి ప్రజల్లో ఆరోగ్యశ్రీ పథకాలపై అవగాహన కల్పించాలని, వారి ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ఏయే కేసులకు వర్తిసుందో, ఆసుపత్రి సంబంధిత వివరాలను ఇంటింటికీ తెలపాలన్నారు. ఫేజ్-1 కార్యక్రమాల్లో మిగిలిన వారిని, సర్వేలో మిస్ అయిన వారిని మొత్తం టార్గెట్‌ను కవర్ చేయాలన్నారు. వాలంటీర్లతో సమన్వయం చేసుకుని వెళ్లాలని తెలిపారు. ఇంటింటికీ తిరిగినప్పుడు సిఎం జగన్మోహన్ రెడ్డి వాయిస్ మెసేజ్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లి వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులను సంఘటితం చేసి ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశాలకు ఆహ్వానం తెలపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎంపిహెచ్ఇఒ శంకర్, హెచ్‌విలు అరుణమ్మ, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తిరణ్ కుమార్

ప్రజల్లోకి వైసిపి సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని పిలుపునిచ్చారు. పల్లెకి పోదాం కార్యక్రమం లో భాగంగా శుక్రవారం రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామపంచాయతీ వద్ద ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు వైసిపి గత నాలుగు సంవత్సరాలలో పరిపాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఏరుపల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. అనంతరం వాలంటీర్లకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం శ్రీధర్, సచివాలయం సిబ్బ ంది, వైసిపి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-రామచంద్రపురం

జాతీయస్థాయి ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్య శాఖ అధికారి ఎందుర్గారావు దొర శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద డివిజన్లోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరును డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఎఫ్‌డిపి నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమలత సమీక్షించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం లో మెడికల్ ఆఫీసర్లు అంగనవాడీ స్కూల్ సందర్శించి పిల్లల యొక్క ఆరోగ్య స్థితినితెలుసుకోవాల్సిందిగా సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జరిగిన రిఫరల్ కేసులను అవసరత గల నెట్వర్క్ ఆసుపత్రులకు పంపించి ఫాలోఅప్ సర్వీసెస్ అందించాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రపురం సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, మెడికల్ ఆఫీసర్లు మరియు జిల్లా కార్యాలయ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 4/2023
Between:
Savarapu Chanti
Savarapu Tataji ...*Petitioners*
AND
Chuttugulla Raja Ramesh and others ...*Respondents*
R-1: Chuttugulla Raja Ramesh, S/o. Yedukondalu, 87 years, R/o. D.No. 13, Maddulameraka, Kothapeta, Dr. B.R.Ambedkar Konaseema Dist.,
(Driver of APSRTC Bus No. AP 29 Z 1750)
పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 04-01-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **ఎన్.వెంకటరాజు**
14-12-23 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 80/2022
Between:
State Bank of India, R.A.S.M.E.C.C. & S.A.R.C., Danavaipeta, Rajahmundry, Rep. by its Manager, S.A.R.C. wing. ...*Plaintiff*
AND
Kadiyam Ram Kumar and Other ...*Defendants*
D-1: Kadiyam Ram Kumar, S/o. Satyanarayana, Hindu, aged 32 years, Business, D.No. 73-6-17, Narayanapuram, Opp. R.T.O. Office, Rajahmundry, E.G.Dist., Pin: 533105. ...*1st Defendant*
పై నెంబరు 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 28-12-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **ఎం.గోపాలకృష్ణ**
13-12-23 అడ్వకేట్, రాజమండ్రి

యానాం వార్తలు

నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రఘునాయగం, ఎస్ఐ నూకరాజు, కొల్లు ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ప్రసాదరావు

రీజెన్సీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో యానాం రీజన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రైమరీ లెవల్ విభాగంలో పొలిమారి సాత్విక్ ప్రదర్శించిన ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విత్ మిల్లేట్స్ అనే అంశానికి, అలాగే తోట కార్తికేయ ప్రదర్శించిన చంద్రయాన్-3 నమూనా అంశానికి బెస్ట్ సబ్ థీమ్ విభాగంలో బహుమతులు సాధించారు. ఈ అంశాలకు ఉషా రామలక్ష్మీ పి.వి.వరలక్ష్మిలు గైడ్ టీచర్లగా వ్యవహరించారు. చంద్ర యాన్-3 నమోనా ప్రదర్శించిన తోట కార్తికేయ తిరుపతిలో 2024 జనవరిలో నిర్వహించే సధరన్ లెవల్ సైన్స్ ఫేర్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎంలు టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను, గైడ్ టీచర్లను ఆయనతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాలలో ఆర్ఎఒ తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక మహాత్మా గాంధీ బాలుర పాఠశాల, రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆర్ఎఒ మునిస్వామి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వండిన భోజన పదార్థాలను వాటి నాణ్యతను ఆర్ఎఒ మునిస్వామి స్వయంగా తిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పాఠశాల హెచ్ఎంలు ప్రతిరోజు పరిశీలించాలని సూచించారు. మెనూ ప్రకారం మంచి భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.

జనరల్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ కాకినాడ ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
I.P. No. 40/2023
పిటిషనరు: జక్కా వీర నాగ శివ శ్రీనివాస్
AND
రెస్పాండెంట్లు:
1. తాడి (కొవ్వూరి) మణికంఠ రెడ్డి, S/o. తెలీదు, వయస్సు 40 సం॥లు, హిందూ, వ్యాపారం, సత్య గౌరీ థియేటర్ దగ్గరలో, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, సెల్:7989852322.
2. చిన్నం వీరభద్రారెడ్డి, S/o. వీర వెంకటరెడ్డి, వయస్సు 45 సం॥లు, హిందూ, వ్యాపారం, వైఎస్ఆర్ విగ్రహం దగ్గరలో, కొంకుదురు గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 9666699993.
3. పడాల సత్యనారాయణరెడ్డి, S/o. తెలీదు, వయస్సు 50 సం॥లు, హిందూ, వ్యాపారం, రామాలయం ఎదురుగా, పందలపాక గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 9849516289.
4. కర్రి సుబ్బారెడ్డి, S/o. శేషారెడ్డి, వయస్సు 45 సం॥లు, శేషా మహల్ థియేటర్ ఎదురుగా, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మంలం, కాకినాడ జిల్లా, సెల్: 9177751115.
5. కర్రి శివరెడ్డి @ జ్యోలపతి, S/o. తెలీదు, వయస్సు 40 సం॥లు, హిందూ, వ్యాపారం, ధ్వజ స్తంభం వీధి, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 998583399.
6. కొవ్వూరి హరిరెడ్డి, S/o. తెలీదు, వయస్సు 31 సం॥లు, హిందూ, వ్యాపారం, లక్ష్మి నర్సాపురం పాటిమీద, జి.మామిడాద గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9652399993.
7. ఎరమాటి శ్రీనివాసు, S/o. కుసలయ్య, వయస్సు 40 సం॥లు, హిందూ, వ్యాపారం, బొడ్డు భాస్కర రామారావు వీధి, పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9052545657.
8. కలగా నరేంద్ర, S/o. సుబ్బారావు, వయస్సు 45 సం॥లు, హిందూ, వ్యాపారం, బొడ్డు భాస్కరరావు కాలనీ, పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9381322619.
9. పోలా రెడ్డి, S/o. తెలీదు, వయస్సు 40 సం॥లు, హిందూ, వ్యాపారం, లక్ష్మి నర్సాపురం, పాటిమీద, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9714165555.
10. యర్లగడ్డ రాజబాబు, S/o. తెలీదు, వయస్సు 50 సం॥లు, హిందూ, వ్యాపారం, పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
11. మేడపాటి వెంకట సూర్యనారాయణరెడ్డి, S/o. మీరా రెడ్డి, వయస్సు 36 సం॥లు, హిందు, వ్యాపారం, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
12. మేడపాటి రామారెడ్డి, S/o. నారాయణరెడ్డి, వయస్సు 38 సం॥లు, హిందూ, వ్యాపారం, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మంలం, కాకినాడ జిల్లా.
13. సత్తి బాబారెడ్డి, S/o. నారాయణరెడ్డి, వయస్సు 42 సం॥లు, హిందూ, వ్యాపారం, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
14. అఫీషియల్ రిసీవర్, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి కాంపౌండ్, రాజమహేంద్రవరం.
పై నెంబరు పిటీషన్‌లో పిటీషనరును ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయించమనిన్ని, పిటిషనరు ఆస్తిని మేనేజ్ చేయుటకు అఫీషియల్ రిసీవర్ను నియమించుటకు వగైరా సంగతులతో పిటీషనరు ఇన్సాల్వెంట్ పిటిషన్ దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియచేయుటకు పై కోర్టు వారి ఎదుట **ది. 11-01-2024 తేది ఉదయం గం॥ 10.30 ని॥లకు** ఆక్షేపణదారులు హాజరు అయ్యి మీరు మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
పిటిషనరు తరపున అడ్వకేట్
వందే విజయ రాజ్‌కుమార్
గణపతి నగర్, సామర్లకోట, కాకినాడ జిల్లా
సెల్: 8555051549, 9951063349